batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

18 అక్టోబర్ 2026
ఆదివారం

## ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటుతో స్థానికంగానే మరింత మెరుగైన సేవలు

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఆధార్ సేవా కేంద్రం ద్వారా ప్రజలకు స్థానికంగానే మరింత మెరుగైన సేవలు లభిస్తాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు.

– నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ

2 లో



# బల్దియాలో కొత్తగా ఐదు సర్కిళ్లు

- నలుగురు జవాన్లకు ఎస్సైలుగా ప్రమోషన్
- పది సర్కిళ్లకు ఎస్సైల నియామకం
- అంతర్గతంగా ఎస్సైల బదిలీలు

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుద్ధ్య పనుల నిమిత్తం సర్కిళ్లను పెంచారు. ఇది వరకు 50 డివిజన్లకు 5 జోన్ లు ఉండగా దాని ప్రకారమే సర్కిళ్లను నిర్వహించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం, ఆర్మూర్ నియోజకవర్గం నుంచి విలీన గ్రామాలతో కలిసి పది డివిజన్లు పెరిగిన విషయం తెల్సిందే. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రస్తుతం 60 డివిజన్లు ఉండగా సర్కిళ్ళను పెంచుతూ అందులో భాగంగా కొందరికీ జవాన్లకు ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న ఎస్సైలను అంతర్గతంగానే బదిలీ చేస్తూ నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

– నిజామాబాద్, బతుకమ్మ




2

## తాగునీటి సమస్య తలెత్తకుండా

# నిరంతర పర్యవేక్షణ

అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

నీటి వనరులు వృధా కాకుండా గట్టి నిఘా కొనసాగించాలి : కలెక్టర్

2 లో



ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిరంతర పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంట సాగు చేయవద్దని రైతులకు హితవు పలికారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు,మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్,గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో తాగునీటి సరఫరా,పంటల సాగు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.

– నిజామాబాద్, బతుకమ్మ

## అక్రమ వడ్డీ వ్యాపారులపై

# పోలీసుల మెరుపు దాడులు

67 ప్రాంతాల్లో తనిఖీలు

42 చోట్ల చెక్కులు, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్స్, నగదు స్వాధీనం



4 లో

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమంగా వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో ప్రజలను అధిక వడ్డీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు నిర్వహించారు.

– నిజామాబాద్ క్రైం, బతుకమ్మ

# శభాష్ సిరిసిల్ల

## పాత్రికేయుల కోసం ఏకమైన ప్రజాసంఘాలు

అక్రమ కేసులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్సైపై చర్యల కోసం నిరసనలు

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన

రాజన్నసిరిసిల్ల జిల్లాలో గంబీరావుపేట్ ఎస్సై శ్రీకాంత్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిరిసిల్ల జిల్లా ముక్తకంఠంతో ఘోషిస్తుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో గంబీరావుపేట్ ఎస్సై శ్రీకాంత్ పై హత్యాయత్నం కేసులు, అట్రాసిటి కేసులు పెట్టి అతన్ని ఉద్యోగం నుంచి తొలగించాలనే డిమాండ్ తో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు.





2 లో

ఇది వరకే బాధితులను ఆసుపత్రిలో పరామర్శించిన ఐజేయూ ఎస్సై తీరుపై మండిపడింది. ఆయనను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గంబీరావుపేట్ ఎస్సై శ్రీకాంత్ పాత్రికేయుల పట్ల వ్యవహరించిన తీరు వివాదాస్పదం కావడంతో రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బీగితే స్పందించారు. ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఎస్సై శ్రీకాంత్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి డిస్మిస్ చేయాలనే డిమాండ్ తో రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ అధినేత విశారదమహారాజ్ వారికి మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఎస్సై పై క్రిమినల్ కేసులు నమోదు చేసి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.

– రాజన్నసిరిసిల్ల, బతుకమ్మ

# తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ




ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలను ఏదోవిధంగా కాపాడుకోగలిగినా రబీలో పంటలకు సాగునీరు అందించడం కష్టతరంగా మారుతుందని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు అందుబాటులో ఉన్నందున తగినంత విద్యుత్ ఉత్పత్తి జరుగక, పంటలకు కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వచ్చే పది నెలల వరకు నిజామాబాద్ నగరం సహా అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా ప్రైవేట్ వ్యాపారులను, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జాగ్రత్తలు సూచించారు. ఖరీఫ్ లో ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంటకు ప్రస్తుతం మార్కెట్ మంచి గిట్టుబాటు ధర పలుకుతోందని, దిగుబడులు కూడా ఆశించిన మేరకు చేతికి అందుతున్నాయని అన్నారు. అయితే రైతులు తమ పంటను నగదు పద్ధతిన విక్రయించాలని అన్నారు. గతంలో రైతుల నుంచి పంట సేకరించి నగదు చెల్లించకుండా పలువురు వ్యాపారులు మోసగించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నగదు చెల్లింపులు వెంటదివెంట జరిపే వారికే ధాన్యం విక్రయించాలని హితవు పలికారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎక్కడ కూడా నీటి వృధా జరుగకుండా గట్టి నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

జిల్లాలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చోట మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు వేగంగా చేపట్టేలా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవసరమైన చోట తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప కొత్త బోర్లను తవ్వించకూడదని అన్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటుతో స్థానికంగానే మరింత మెరుగైన సేవలు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ నగరంలోని కోటగల్లి మున్నూరుకాపు సంఘం భవనంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పిన ఆధార్ సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఆధార్‌కు సంబంధించిన వివిధ సేవలను సులభంగా, పారదర్శ కంగా అందించాలనే ఉద్దేశంతో ఆధార్ సేవా కేంద్రాల విస్తరించడం జరుగుతోందని తెలిపారు. ఇదివ రకు ఆధార్ సేవల కోసం హైదరాబాద్ కు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం నిజామాబాద్ సహా తెలంగాణలో 10 ప్రాంతాలలో ఆధార్ సేవా కేంద్రాలను కొత్తగా అందుబాటులోకి తెచ్చారని అన్నారు. దీనివల్ల ప్రజలు ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే సేవలు పొందేందుకు ఇవి ఉపయోగపడతాయని అన్నారు. ఆధార్ సేవా కేంద్రం ద్వారా కొత్త ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో వివరాల సవరణ, చిరునామా మార్పు, పేరు, పుట్టిన తేదీ వంటి వివరాల్లో అర్హత మేరకు మార్పులు చేసుకునే వెసులుబాటు కలిగింద న్నారు. ఆధార్ సేవల కోసం కేంద్రానికి వచ్చే ప్రజలు తమ వెంట అవసరమైన గుర్తింపు, చిరునామా, జనన తేదీ ధ్రువీకరణ పత్రాలను సంబంధిత సేవకు అనుగుణంగా తీసుకురావాలని తెలిపారు. వివిధ సేవలకు సంబం ధించి యూఐడీఏఐ నిర్దేశించిన నిర్ణీత రుసుము మాత్రమే చెల్లించాలని సూచించారు. నిజామాబాద్ లో నూతన ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం వల్ల నగర ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారికి కూడా ఆధార్ సంబంధిత సేవలు పొందడంలో సౌలభ్యం ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్, వివిధ సేవల కోసం ఆధార్ వివరాలు అవసరం అవుతున్న దృష్ట్యా, ప్రజలు తమ ఆధార్ సమాచారాన్ని సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన సేవల కోసం నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవా లని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ ప్రాధికార సంస్థ హైదరాబాద్ ప్రాంతీయ అధికారి శ్రవణ్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ కుమార్, ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ





### పూల పండుగ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద, బతుకమ్మ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. శనివారం బిచ్కుంద మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లా డుతూ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేడుక అని పేర్కొన్నారు. ఈ బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి పండుగ సంబరాల్లో భాగస్వాములైన మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే కి స్థానికులు, మహిళలు సాదర స్వాగతం పలికారు. తెలంగాణ సం స్కృతి, సంప్రదాయాలు చిరకాలం వర్ధిల్లాలని, ప్రతి ఆడ పడుచు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండా లని ఆకాంక్షిస్తూ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# బల్దియాలో కొత్తగా ఐదు సర్కిళ్లు

ఈ మేరకు ఈ నెల 16న ఆదేశాలు వెలువడ్డాయి .నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇది వరకు 5 సర్కిళ్ళలో సానిటరి ఇన్స్ పెక్టర్ల ఆధ్వర్యంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్ మెంట్ ద్వారా పబ్లిక్ హెల్త్ విభాగంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ప్రస్తుతం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఎండి.షాదుల్లా హుస్సేన్ ఒక్కరే రెగ్యులర్ ఎస్సైగా పని చేస్తున్నారు. ప్రభుదాస్ ఎన్ఎంఆర్ గా పని చేస్తుండగా, మహిపాల్, ప్రశాంత్, శ్రీకాంత్, సునీల్ కుమార్, కృష్ణలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఎంపికై ఎస్సైలుగా చెలామణి అవుతున్నారు. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ లో రెగ్యులర్ ఉద్యోగులుగా జవాన్లుగా పని చేస్తున్న కుమార్, ప్రసాద్, లతీఫ్, రజాక్ లను సానిటరి ఇన్స్ పెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. మొన్నటి వరకు ఐదు సర్కిళ్ళు ఉండగా పది సర్కిళ్ళు కావడంతో కొత్తగా ప్రమోషన్లు పొందిన జవాన్లతో పాటు ఔట్ సోర్సింగ్ వారికి కూడా వివిధ సర్కిళ్ళకు ఎస్సైలుగా నియమించారు. ప్రస్తుతం 3వ సర్కిల్ కు ఇంచార్జి ఎస్సైగా ఉన్న మహిపాల్ కు సర్కిల్ -1 ఏ (1,15,16,17,35,36 డివిజన్లు) కు బదిలీ చేశారు. 23వ డివిజన్ ఇంచార్జి ఎస్సైగా ఎన్.ప్రసాద్ సర్కిల్ -1 బిని కేటాయించగా (37,38,39,40,43డివిజన్), 22వ డివిజన్ ఎస్సైగా ఉన్న కుమార్ కు 2ఏ సర్కిల్ ను కేటాయించారు. ఈ సర్కిల్ పరిధిలో (4,5,6,7,22,24) డివిజన్లు ఉన్నాయి. 1వ సర్కిల్ కు సానిటరి ఇన్స్ పెక్టర్ గా ఉన్న ప్రశాంత్ 2బి సర్కిల్ ను కేటాయించారు. అందులో (23,25,26,45, 46,47,48) డివిజన్లు ఉన్నాయి. సర్కిల్ 5 ఎస్సైగా ఉన్న శ్రీకాంత్ కు 3ఏ సర్కిల్ ను కేటాయించగా అందులో (8,9,27,28,50) డివిజన్లు ఉన్నాయి. 4ఏ సర్కిల్ ఎస్సైగా ఉన్న కృష్ణకు 3బి సర్కిల్ ను కేటాయించగా అందులో (49,51,52,56,57,58,59) డివిజన్లు ఉన్నాయి. డంపింగ్ యార్డు ఇంచార్జి ఎస్సైగా ఉన్న ప్రభుదాస్ కు 4ఏ సర్కిల్ ను కేటాయించగా అందులో 20,21,33,44 డివిజన్లున్నాయి. సర్కిల్ 2 ఎస్సైగా ఉన్న సునీల్ కుమార్ కు 4బి సర్కిల్ ను కేటాయించగా అందులో 2,3,18,19,41,42 డివిజన్లు ఉన్నాయి. 4బి సర్కిల్ ఎస్సైగా ఉన్న ఎం.డి.షాదుల్లా హుస్సేన్ కు 10,11,12,13,14,30,31 డివిజన్లను కేటాయించారు. డివిజన్ 14,31 ఇంచార్జి ఎస్సైగా ఉన్న అబ్దుల్ రజాక్ కు 5బి సర్కిల్ ను కేటాయించారు. ఈ సర్కిల్ లో 32,29,53,54,55,60 డివిజన్లున్నాయి. డివిజన్ నంబర్ 11 ఇంచార్జి ఎస్సైగా ఉన్న లతీఫ్ ను డంపింగ్ యార్డు ఇంచార్జి సానిటరి ఇన్స్ పెక్టర్ గా నియమించారు. పరిపాలన సౌలభ్యం, చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడానికి సర్కిళ్లను పెంచిన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ను మాత్రం నియమించడంలో చొరవ చూపలేదు. కార్పొరేషన్ లో ఎంహెచ్ వోగా ఎంబీబీఎస్ వైద్యుడు ఉండాల్సిన చోట ఎస్సై క్యాడర్ గా ఉన్న ఉద్యోగితోనే కాలం వెల్లదీస్తున్నారు. ఎంహెచ్ వో గా వైద్యుడు లేకపోవడంతో పారిశుద్ధ్యంతో పాటు పశువధ శాల, హోటళ్ళపై పర్యవేక్షణ కరువైంది. కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాత అయినా డాక్టర్ ను ఎంహెచ్ వోగా నియమిస్తారని ఆశపడ్డ వారికి నిరాశ తప్పడం లేదు. కార్పొరేషన్ కు ఐఏఎస్ లు కమిషనర్లుగా నియమితులైతున్న ఎంహెచ్ వోలు మాత్రం డాక్టర్లను నియమించకపోవడం దారుణం.

# శభాష్ సిరిసిల్ల

ఏక్ ధం న్యూస్ ఎడిటర్ శేఖర్, రిపోర్టర్ సంపత్ లు గంబీరావుపేట్ ఎస్సై శ్రీకాంత్ చేసిన అవినీతి, అక్రమాలపై వరుస కథనాలు ప్రచురించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఏక్ ధం న్యూస్ ఎడిటర్ శేఖర్ తో పాటు రిపోర్టర్ సంపత్ లపై కేసులు నమోదు చేసిన శేఖర్ వారిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చకముందే థర్డ్ డిగ్రీ ప్రయోగించి చితకబాదారు. ఈ విషయాన్ని న్యాయమూర్తి ముందు ఇద్దరు విలేకరులు తమకు జరిగిన అన్యాయాన్ని ఏకరువుపెట్టారు. దానితో న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేశారు. అంతేగాకుండా ఎస్సై, పోలీసు సిబ్బంది కొట్టిన దెబ్బలపై న్యాయమూర్తి స్పందించి వైద్య పరీక్షలను నిర్వహించి వారి వాంగ్మూలాన్ని సేకరించారు. ఆ నివేదిక ఆధారంగానే జిల్లా ఎస్పీ స్పందించి ఎస్సై శ్రీకాంత్ ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కానీ శ్రీకాంత్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అరెస్టు చేయాలనే డిమాండ్ తో జరుగుతున్న ఆందోళనకు ప్రతిపక్షాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జిల్లా ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బీగితేకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధ్యుడైన ఎస్సై శ్రీకాంత్ పై క్రిమినల్ కేసు లు నమోదు చేసి సస్పెండ్ చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

# వరంగల్ కోర్టు సంచలన తీర్పు

### భర్త హత్య కేసులో భార్యతో సహా 10 మందికి జీవిత ఖైదు



వరంగల్, బతుకమ్మ : తెలంగాణలో వైవాహిక వివాదాల నేపథ్యంలో జరిగిన దారుణ ఘటనకు సంబంధించి వరంగల్ జిల్లా కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. రంగంపేటకు చెందిన దత్తు శ్రీనివాస్ హత్య కేసులో భార్యతో పాటు ఆమె కుటుంబంలోని మరో 9 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే రంగంపేటకు చెందిన దత్తు శ్రీనివాస్ కు, వరంగల్ నగరంలోని రంగశాయిపేటకు చెందిన బజ్జూరి రమ్యశ్రీకి 2015లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. అయితే పెళ్లయిన ఏడాదిలోపే ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. దీంతో రమ్యశ్రీ పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత భర్త, అతని కుటుంబ సభ్యులపై పలు కేసులు నమోదు చేయించింది. ఆ కేసులను శ్రీనివాస్ కుటుంబం కోర్టులో ఎదుర్కొంటూ వచ్చింది. ఈ వివాదాలు కొనసాగుతున్న క్రమంలోనే 2024 ఫిబ్రవరి 13వ తేదీన బొడ్రాయి పండుగ ఉంది కలిసి జరుపుకుందాం, ఉన్న సమస్యలకు ఫుల్ స్టాప్ పెడదాం అని అత్తింటివారు శ్రీనివాస్ ను ఇంటికి ఆహ్వానించారు. భార్యను తిరిగి కాపురానికి తీసుకెళ్లవచ్చనే ఆశతో శ్రీనివాస్ అత్తగారింటికి వెళ్లారు. అక్కడ జరిగిన ఘర్షణలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో, అవే కీలక సాక్ష్యాధారాలుగా మారాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. దాదాపు రెండేళ్ల పాటు సాగిన విచారణ అనంతరం, న్యాయమూర్తి అన్ని సాక్ష్యాధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నేరం రుజువైందని భావించి, భార్య రమ్యశ్రీ, ఆమె తల్లిదండ్రులు, సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు, స్నేహితురాలు అలేఖ్యతో సహా మొత్తం 10 మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ తీర్పుతో వరంగల్ లో ఒక్కసారిగా ఈ కేసు చర్చనీయాంశంగా మారింది. వైవాహిక వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జినిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ప్రభుత్వాల ఉదాసీనత మూలంగా పనులు పూర్తవటానికి మరొక రెండు సంవత్సరాలు పట్టే అవకాశం ఉందని నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు దీకొండ యాదగిరి అన్నారు. నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రతినిధి బృందం అర్సపల్లి అభివృద్ధి కమిటీ సంయుక్తంగా అరసపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దీకొండ యాదగిరి మాట్లాడుతూ 137 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం 20 23లో ప్రారంభించారని, అది 2025 సెప్టెంబర్ కు పూర్తి కావాలని, ప్రస్తుతం పనులు మాత్రం నామమాత్రం జరుగుతున్నాయని ఆయన అన్నారు. అర్సపల్లి అభివృద్ధి కమిటి ప్రతినిధులు చాగంటి గంగాధర్, సిర్ప గంగాధర్, నాగయ్య తదితరులు మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు తాము తమ భూములను కారు చౌకగా ఇచ్చామని, కానీ గత మూడు సంవత్సరాలుగా తమకు మాత్రం దుమ్ము, ధూళి తో గ్రామంలోని అనేకమంది అనారోగ్యానికి గురయ్యారని, ఏడుగురు యాక్సిడెంట్ల మూలంగా చనిపోయారని, కొంతమంది అంగవైకల్యం పొందారని వారన్నారు. ప్రతిరోజు గంటల తరబడి రైల్వే గేటు మూసి వేయటం మూలంగా వందలాది వాహనాలు గ్రామంలో నిలబడి పోతున్నాయని , దీని మూలంగాసామాన్య జీవనం కూడా కొనసాగించలేకపోతున్నామని వారు వాపోయారు. నగర అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి కె రామ్మోహన్ రావు మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం విడనాడాలని, సర్వీసు రోడ్లను నిర్మించాలని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లు స్వరాజ్యం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవీంద్ర నాథ్ సూరి రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు సిర్ప హనుమాన్లు, ఈవిల్ నారాయణ, ప్రసాద్ రావు, నగర అభివృద్ధి కమిటీ నాయకులు హుస్సేన్, మధుసూదన్, రాధా కిషన్, లింగయ్య, భూమన్న, బాలన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ముందు చూపు లేకనే విద్యుత్ కోతలు







## కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి

కామారెడ్డి, బతుకమ్మ : రైతులకు కోతలు లేని నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనత పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డిల ఆధ్వర్యంలో కామారెడ్డి సబ్ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం విద్యుత్ ఎస్ఈకి సాల్య నాయక్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు, బీజేఎల్పీ ఉపనేత కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందు చూపు లేకనే రైతులు విద్యుత్ కోతలు ఎదుర్కోవాల్సి వస్తుందనీ, ఎలెనినో వల్ల సమస్య ఉంటుందని 6 నెలల ముందే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టలేదనీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కాళేశ్వరం పేరిట గత ప్రభుత్వాన్ని విమర్శించడం పై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదనీ అన్నారు. ఈ పంట కి నీళ్ళు తప్పనిసరిగా ఇవ్వాలనీ , యాసంగి పంటకి క్యాబ్ ప్రణాళిక ఇప్పుడే తయారు చేయాలనీ డిమాండ్ చేశారు. లేకపోతే త్రాగు నీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందనీ అన్నారు.

# స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్ట్ దివ్యాంగుల పాఠశాలలో సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహ సొసైటీ అందుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సిబ్బంది, దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అందంగా రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి,కుంకుమ, పసుపుతో గౌరమ్మను తయారు చేసి బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సంధర్భంగా నిర్వాహకులు ఎస్ .సిద్దయ్య, జ్యోతిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ అని మహిళలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ అన్నారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అయితే గతంలో బతుకమ్మ పండుగను ఉమ్మడి రాష్ట్రంలో కూడా జరుపుకున్నప్పటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రత్యేకంగా రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రతి ప్రభుత్వ,ప్రైవేట్ కార్యాలయాల్లో జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా ఈ పండుగను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ పండుగ మహిళా మణుల పండుగ అన్నారు. ఈ పండుగ ద్వారా మహిళలు, ప్రజలు, సుఖ సంతోషాలతో ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ టీ ఐ ప్రాజెక్ట్ సిబ్బంది, అందుల ప్రత్యేక పాఠశాల సిబ్బంది, మానసిక వికలాంగుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పండగకు ఊరెళ్లండి... దొంగలకు ఛాన్స్ ఇవ్వొద్దు

## కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి, బతుకమ్మ : ఇంటికి తాళం వేసే ముందు భద్రతను నిరారించుకోండి. బంగారం, నగదును ఇంట్లో ఉంచకుండా భద్రపరచుకోండి అని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రజలకు సూచనలు చేసారు. దసరా పండుగ కోసం ఊరెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండని కోరారు. ఇంటి పరిసరాల్లో, కాలనీలలో, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రయాణంలో వేగం వద్దని హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి అని వాహనదారులకు సూచించారు. ఇంటికి తాళం మీది.. భద్రత బాధ్యత మనందరిది అని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర పేర్కొన్నారు.పండుగను ఆనందంగా జరుపుకోండి.. మీ ఇంటికి భద్రత కల్పించుకోండి. పోలీసుల సూచనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించండి అని ఎస్పీ ప్రజలకు సూచనలు చేసారు.

## 108 అంబులెన్స్ ఎంసి హెచ్ ఎన్ ఆర్ సీ కేంద్రాలను తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 108 అంబులెన్స్ ను, ఎంసి హెచ్ కేంద్రాన్ని, ఎన్ఆర్సి కేంద్రాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ బి.రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ లో అత్యవసర మందులు ఆక్సిజన్ సిలిండర్ స్ట్రక్చర్, రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా ఎం సి హెచ్ కేంద్రం నందు మాతా శిశు ఆరోగ్య సేవలో రికార్డులను, అందిస్తున్న సేవలను, టీకాలను, ఎన్ఆర్సి న్యూట్రిషనల్ రిహా బిలిటేషన్ కేంద్రంలో సామ్ మామ్ పిల్లల పోషకాహార స్థితిని, పిల్లలతో ముఖా ముఖిగా మాట్లాడారు. పోషకాహారం అంది స్తున్నది తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ రేఖ, డాక్టర్ నిరూప్ రెడ్డి, డాక్టర్ శ్రీలత, డాక్టరు శిఖరా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## దేవీమండపాలను సందర్శించిన నగర మేయర్



ఇందూర్, బతుకమ్మ : దేవీ నవరాత్రుల సందర్భంగా నగరంలోని పలు దేవి మాతా మండపాలను నగర మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్ సందర్శించారు. మేయర్ దేవి మాతలకు పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి పూజలు చేశారు. అనంతరం కమిటీ వారు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాలొనిస్థానిక ప్రజలకు, భక్తులకు అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ దేవీ నవరాత్రుల ప్రాముఖ్యతను, అన్నదానం వంటి సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను వివరిస్తూ దేవి మాతా ఆశీస్సులు అందరికీ లభించాలని, సమాజంలో సేవా భావన పెరగాలని కోరారు.

## ఘనంగా దేవి ఉత్సవాలు

### ఏడవ రోజు శ్రీమహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

### రూపాల దండలతో అమ్మవారికి అలంకరణ



భీమ్‌గల్, బతుకమ్మ :దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో దేవి ఉత్సవాలను గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడవ రోజైన శనివారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి దేవి రూపంలో దర్శనం ఇవ్వగా నిర్వాహకులు దుర్గాదేవి ఉత్సవ కమిటీ, యువ చైతన్య యూత్ ల ఆధ్వర్యంలో అమ్మవారికి రూపాల (నోట్ల)దండలను వేసి పూజించారు. మంటపాన్ని నోట్ల దండలతో అందంగా అలంకరించి శ్రీమహాలక్ష్మి దేవిని స్తుతించారు. కొలువుదీరిన దుర్గాదేవికి ఐదో లక్షల రూపాయల వ్యయంతో వైభవంగా అలంకరణ చేపట్టారు. అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించడంతో ఉత్సవ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, యువజన సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపడుతున్నారు. గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

## పిఆర్ టియు రాష్ట్ర కౌన్సిల్‌లో ఏర్గట్ల మండలానికి రాష్ట్ర పదవులు

### కృతజ్ఞతలు తెలిపిన ఏర్గట్ల మండల పిఆర్టియు అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్



గటాడి భాస్కర్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు | మగ్గిడి ప్రవీణ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు | దశెంధర్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు | సబ్బాని శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ఏర్గట్ల,బతుకమ్మ: పిఆర్ టియు ఆరవ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఏర్గట్ల మండలం నుంచి రాష్ట్ర స్థాయి పదవులకు ఏర్గట్ల మండల ఉపాధ్యాయ నాయకులను నామినేట్ చేయడం జరిగిందని ఏర్గట్ల మండల పిఆర్టియు అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్ తెలిపారు.అసోసియేట్ ప్రెసిడెంట్స్ గా 1గటాడి భాస్కర్ --జడ్పీహెచ్ఎస్ తాళ్ల రాంపూర్, 2మగ్గిడి ప్రవీణ్ --జెడ్పి హెచ్ఎస్ తోర్తి,3దశెంధర్ --జడ్పిహెచ్ఎస్ తోర్తి,వైస్ ప్రెసిడెంట్ గా1సబ్బాని శ్రీనివాస్ --జడ్పిహెచ్ఎస్ ఏర్గట్ల,ను నియమించడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఏర్గట్ల మండలానికి రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం కల్పించేలా సహకరించిన జిల్లా అధ్యక్షులు శంకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్,పిఆర్ టియు ఏర్గట్ల మండల శాఖ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఏర్గట్ల మండల అధ్యక్షులు బి.కృష్ణ ప్రసాద్,మండల ప్రధాన కార్యదర్శి డి.ప్రవీణ్ శర్మ తెలిపారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి,సంఘ బలోపేతానికి రాష్ట్ర స్థాయిలో నూతనంగా నామినేట్ అయిన నాయకులు మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఏర్గట్ల మండలానికి సముచిత ప్రాధాన్యత కల్పించిన జిల్లా నాయకత్వానికి మరియు ఏర్గట్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు రాష్ట్ర పోస్టులకు అవకాశం కల్పించిన సందర్భంగా వారు ధన్యవాదాలు తెలియజేశారు.

## రుద్రూర్‌లో దుర్గామాత వద్ద అన్నదానం...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలోని దుర్గామాత వద్ద శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 7వ రోజు అమ్మవారు శ్రీ సరస్వతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మండపం వద్ద అన్నదాత డి. సాయిలు (ఎంఈఓ) భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపటారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత మాలధారణ స్వాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, మహిళలు, అన్నదాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ ఫ్రీ హెల్త్ క్యాంప్‌ను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ సమీర్



భీమ్ గల్, బతుకమ్మ :బాబాపూర్ గ్రామంలో నేడు నిర్వహించనున్న చిల్డ్రన్స్ ఫ్రీ హెల్త్ క్యాంప్ ను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ సమీర్ కోరారు. నిజామాబాద్‌లోని ఆర్యన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ సమద్ నేతృత్వంలోని ఆరుగురు చిన్న పిల్లల డాక్టర్ బృందంతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఫ్రీ క్యాంప్ ను బాబాపూర్ గ్రామ కమిటీ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలకు అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. ఈ ఉచిత శిబిరం ద్వారా పిల్లలకు వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశం ఉందని, గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను శిబిరానికి తీసుకువచ్చి వైద్య సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, గ్రామ ప్రజలు ఈ అవకాశంగా తీసుకోవాలన్నారు.

# పోలీసులమంటూ వ్యాపారి కిడ్నాప్..!

### రూ.15 కోట్ల డిమాండ్

### రూ.1.3 కోట్లు వసూలు

హైదరాబాద్, బతుకమ్మ : హైదరాబాద్‌లో ఓ 53 ఏళ్ల నగల వ్యాపారిని పోలీసులమంటూ కిడ్నాప్ చేసిన ముఠా కుటుంబ సభ్యుల నుంచి రూ.15 కోట్లు డిమాండ్ చేసి, రూ.1.3 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అక్టోబర్ 5న రామంతాపూర్‌లోని తన నగల దుకాణానికి వెళుతున్న కే. శ్రీనివాసరావును గోల్నాక ఫ్లైఓవర్ సమీపంలో కిడ్నాప్ చేసి, కళ్లకు గంతలు కట్టి గుర్తుతెలియని ప్రాంతానికి తరలించినట్లు విచారణలో వెల్లడైంది.బోడుప్పల్‌లోని హేమానగర్ రియల్ ఎస్టేట్ వెంచర్ వివాదమే కిడ్నాప్‌కు కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రధాన నిందితుడు దుమావత్ శ్రీకాంత్, గుంజపోగు సురేష్ అలియాస్ సూర్య, సూరి, శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆగస్టులోనే కిడ్నాప్‌కు ప్లాన్ చేసినట్లు గుర్తించారు. చిక్కడపల్లి పోలీసులు, సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా 10 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.07 కోట్ల నగదు, 118.26 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు వాహనాలు, తొమ్మిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాలు మార్చుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకునేందుకు ముఠా ప్రయత్నించింది. ప్రధాన నిందితుడు శ్రీకాంత్‌పై గతంలో 16 చీటింగ్ కేసులు ఉండగా, సురేష్‌పై ఆస్తి నేరాలు,



దొంగతనాలు, దోపిడీలు, కిడ్నాప్ కేసులు ఉన్నాయి. మరో నిందితుడు బండారి శాంసన్ అలియాస్ లక్కీపై ఐదు ఆస్తి నేరాలున్నాయి. శ్రీనివాస్ రెడ్డితో సహా ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, మిగిలిన డబ్బు రికవరీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## అక్రమ వడ్డీ వ్యాపారులపై నిజామాబాద్ పోలీసుల మెరుపు దాడులు

ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది సంబంధిత వడ్డీ వ్యాపారుల ఇళ్లతో పాటు అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. కమీషనరేట్ పరిధిలో మొత్తం 67 ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించగా, 42 ప్రాంతాల్లో చెక్కులు, ప్రామిసరీ నోట్లు,నగదు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారాలకు సంబంధించిన ఆధారాలపై పోలీసులు పరిశీలన చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.అప్పుల పేరుతో ప్రజలను బెదిరించడం, బలవంతంగా చెక్కులు లేదా ఇతర పత్రాలు తీసుకోవడం, చట్టవిరుద్ధంగా అధిక వడ్డీలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ వడ్డీ వ్యాపారాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతుందని,బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. అక్రమ వడ్డీ వ్యాపారులు లేదా అధిక వడ్డీల పేరుతో వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తుల గురించి సమాచారం తెలిసినా, బాధితులుగా ఉన్నా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని పోలీసు శాఖ సూచించింది.

## సీఐని సన్మానించిన కాంగ్రెస్ మైనార్టీ ప్రెసిడెంట్

భీమ్‌గల్, బతుకమ్మ :మండల కాంగ్రెస్ మైనార్టీ ప్రెసిడెంట్ గా నూతన ఎన్నికైన పురాణిపేట్ గ్రామానికి చెందిన ఎం.ఏ.కలీం శనివారం భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐని శాలువతో సన్మానించారు. అనంతరం ఎం.ఏ.కలీం మాట్లాడుతూ,మైనార్టీ వర్గాల ప్రజలు, నాయకులకు పోలీస్ శాఖ తరఫున అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని సీఐని కోరారు. ప్రజలకు,పోలీసులకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మైనార్టీల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మండల ప్రెసిడెంట్ గా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమం, ప్రజాసేవకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతానని ఆయన వెల్లడించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ హకీమ్, నదీమ్, జనరల్ సెక్రటరీ సలీం, మైనార్టీ నాయకులు షోయబ్, జావీద్, అఖిల్, తదితరులు ఉన్నారు.




## పారిశుధ్య కార్మికుడు విఠల్‌కు నివాళ్ళు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలో ఆరో డివిజన్ పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులు విఠల్ రోడ్డు యాక్సిడెంట్లో మరణించినందుకు ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మృతికి తెలంగాణ అమరవీరుల పార్క్ సభ్యులు సామాజిక కార్యకర్తలు న్యావనండి పురుషోత్తం పటేల్, పల్లె రాజేందర్, కొట్టు రమేష్, శ్రీనివాస్ గౌడ్, పుల్లప్ప, మున్సిపల్ సభ్యులు పాల్గొన్నారు. ఆయన మరణం తీరనిలోటని ఆయన చేసిన సేవలు మరువలేనివని ప్రతి ఒక్కరూ స్మరించుకున్నారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రతి ఒక్కరు కొనియాడారు. మున్సిపల్ వర్కర్లు సైదులు, రాము, చందు పాల్గొన్నారు.



## నిజామాబాద్ బస్టాండ్‌లో 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం

ఇందూర్, బతుకమ్మ : మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల,ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ బస్టాండులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో లోగోతో పాటు అత్యవసర సహాయ హెల్ప్‌లైన్ నంబర్లతో కూడిన హ్యాండిల్స్‌ను బస్సుల్లో ఫిట్ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య, అర్బన్ సీడీపీఓ విజయలక్ష్మి, డిపో వసుంధర, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్నల చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య



మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, మహిళల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం,



అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపరచడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిఐగా సురేష్ కుమార్

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ: నిజామాబాద్ ట్రాఫిక్ సిఐగా సురేష్ నియమితులయ్యారు. నిజామాబాద్ ట్రాఫిక్ సిఐగా ఉన్న పబ్బ ప్రసాద్ ఇటీవల మహిళ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసిన విషయం తెల్సిందే. ఆ సమయంలో నిజామాబాద్ సౌత్ సర్కిల్ రూరల్ సిఐగా ఉన్న సురేష్ కుమార్ పీసీఆర్ కు బదిలీ చేశారు. ఆనాడు ఉత్తర్వుల్లో సీఎస్ బీ లో ఉన్న గుమ్మడి మల్లేష్ ను నిజామాబాద్ ట్రాఫిక్ సిఐగా నియమించారు. అయితే మల్లేష్ విధుల్లో చేరకపోవడంతో పీసీఆర్ లో ఉన్న సురేష్ కుమార్ ట్రాఫిక్ సిఐగా నియమించారు.



# తీర్మాన్ పల్లి గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ..





## -పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళా మనులు

ఇందల్వాయి,బతుకమ్మ :ఇందల్వాయి మండలంలోని తీర్మాన్ పల్లి గ్రామంలో శనివారం సద్దుల బతుకమ్మను అంగరంగ వైభవంగా ఎంతో భక్తిశ్రద్ధతో ఘనంగా నిర్వహించారు, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలతో, డీజె సౌండ్ తో బతుకమ్మలను ఊరేగించారు, మహిళ మణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ అభివృద్ధి కమిటీ తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు, తీర్మాన్ పల్లి నుండి ఇందల్వాయి స్టేషన్ (గంగారం తండా మీదుగా) బతుకమ్మ లను అత్యాత భక్తిశ్రద్ధలతో ఊరేగించారు, అనంతరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ముందు బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతి ప్రతి బింబించేలా మహా ర్యాలీని ఘనంగా నిర్వహించారు, సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సాధన జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు, ఎస్సై సుమలత ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్ తో పాటు, వైస్ చైర్మన్ జరుగు రాజు, ఇమ్మడి సాయిలు, గాండ్ల ప్రదీప్, కుమ్మరి భాస్కర్, చెన్న తిరుపతి, శెట్టి గంగారం, కురుమ బయ్యన్న,బొడ్డు రాజన్న, తెడ్డు అబ్బయ్య తోపాటు గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

# నడవడిక, నైతిక విలువలకు ప్రాధాన్యామివ్వాలి

**దేవి దయతో వర్షాలు సమృద్ధిగా కురువాలి.**

**సాగు, త్రాగు నీటి సమస్యలు తీరాలి.**

**-ఏబీపీఎస్ నేషనల్ ప్రెసిడెంట్ ప్రబోధ్ సుమేర్,**

భీమ్‌గల్, బతుకమ్మ :కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, మానవత్వం, సోదరభావం, మంచి నడవడిక, నైతిక విలువలకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని ఏబీపీఎస్ నేషనల్ ప్రెసిడెంట్ ప్రబోధ్ సుమేర్ పిలుపునిచ్చారు. దేవీ శరన్నవరాత్రులు, బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని మండలంలోని దేవన్‌పల్లి గ్రామానికి చెందిన ప్రబోధ్ సుమేర్ భీమ్‌గల్ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల పరిధి ప్రజలకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని, సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం, మానవత్వం వెల్లివిరిసినప్పుడే నిజమైన ఐక్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యతను చాటాలని ఆకాంక్షించారు. ఈ భీమ్‌గల్ ప్రాంత ప్రజల జీవనాధారం ప్రధానంగా వ్యవసాయమేనని, వర్షాలు తగ్గడంతో రైతులు సాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రబోధ్ సుమేర్ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి దుర్గమ్మ కరుణతో సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, చెరువులు, కుంటలు నిండి సాగునీటి సమస్యలు తొలగిపోవాలని ప్రార్థించారు. పంటలు పుష్కలంగా పండి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, వ్యవసాయంపై ఆధారపడిన పేదలకు ఆర్థిక ఇబ్బందులు తొలగాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, సంతోషాలు నింపాలని ఆయన అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజల సమస్యలు తొలగిపోయి అందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని



ఆకాంక్షించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటూ పరస్పర సహకారం, మానవత్వంతో ముందుకు సాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ తో మెరుగైన సేవలు

**నిజామాబాద్ సర్కిల్ ఎస్ఈ రాజేశ్వర్ రావు**

నిజామాబాద్ , బతుకమ్మ : రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్టీఎఫ్ఎంఎస్)ను విస్తృత స్థాయిలో అమలు చేస్తూ నిజామాబాద్ సర్కిల్ పరిధిలోని 139 సబ్‌స్టేషన్లను స్కాడాతో అనుసంధానం పూర్తి అయ్యిందని 20 సబ్‌స్టేషన్లు పురోగతిలో ఉన్నాయని నిజామాబాద్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.వి. రాజేశ్వర్ రావు తెలిపారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా విద్యుత్ సరఫరా నాణ్యతను మరింత మెరుగుపరచడం, అంతరాయాలను తగ్గించడం, సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కరించడం, ఫీడర్ల పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించడం ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం



జరుగుతుందన్నారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన??నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు నిజామాబాద్ సర్కిల్ ఎస్ఈ స్పష్టం చేశారు.

ఆర్టీఎఫ్ఎంఎస్ తో ప్రధాన ప్రయోజనాలు . . .

ఆర్టీఎఫ్ఎంఎస్ ద్వారా విద్యుత్ ఫీడర్ల పనితీరును రియల్‌టైమ్‌లో పర్యవేక్షించడంతో పాటు విద్యుత్ అంతరాయాలు??ఓవర్‌లోడ్??వోల్టేజ్ హెచ్చుతగ్గులు తదితర సమస్యలను తక్షణమే గుర్తించి??సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయవచ్చని ఎస్ఈ తెలిపారు. స్కాడా కంట్రోల్ రూమ్ నుంచే విద్యుత్ సరఫరా పరిస్థితిని రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే రియల్‌టైమ్ అలెర్ట్ అందుబాటులోకి వస్తాయి. ఫీడర్లపై ఓవర్‌లోడ్ ఏర్పడినప్పుడు తక్షణ హెచ్చరికలు వస్తాయి. విద్యుత్ వినియోగం, లోవోల్టేజ్ స్థాయిలు, లోడ్ తదితర వివరాలను రియల్‌టైమ్‌లో సేకరించి విశ్లేషించే అవకాశం ఉంటుంది. విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం సులభం అవుతుంది. క్షేత్రస్థాయి సిబ్బంది స్పందన వేగాన్ని పెంచి, విద్యుత్ అంతరాయ సమయాన్ని తగ్గించే వీలు ఉంటుంది. విద్యుత్ సరిఫరా పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయవచ్చు. విద్యుత్ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తూ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా టీజీఎన్పీడీసీఎల్ ముందుకు సాగుతోందని నిజామాబాద్ సర్కిల్ ఎస్ఈ తెలిపారు.

# గుంజిలి గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ...

మాక్లూర్ , బతుకమ్మ : మాక్లూర్ మండలంలోని గుంజిలి గ్రామంలో శనివారం సద్దుల బతుకమ్మను అంగరంగ వైభవంగా ఎంతో భక్తిశ్రద్ధతో ఘనంగా నిర్వహించారు, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డీజె సౌండ్ తో బతుకమ్మలను ఊరేగించారు, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామపంచాయతీ సర్పంచ్ గోపి ఉప సర్పంచ్ సుమన్ తో పాటు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకుంటూ ఊరేగించారు. అనంతరం గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద బతుకమ్మలను పేర్చి మహిళా మణులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ఉప సర్పంచ్ సుమన్,సతీష్,కళ్యాణ్,కార్తీక్,రాజు,సాయికుమార్, శ్రీకాంత్, మాలధార సాములు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగాన్ని కాపాడడమే

# ఓంకార్‌కు నిజమైన నివాళి




డిచ్ పల్లి, బతుకమ్మ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మది కాయల ఓంకార్ 18వ వర్ధంతి కార్యక్రమం గొంగళ్ళ సామ్యూల్ అధ్యక్షతన జరిగింది. శనివారం సాయంత్రం డిచ్ పల్లి మండల కేంద్రంలో మట్టికాయల ఓంకార్ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులను వెలిగించి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కర్రోళ్ల శ్రీనివాస్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి మతోన్మాద పెడ దోరిణిల వల్ల ప్రమాదం సంభవిస్తుందని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్, పాసిస్టు, మోడీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థల్ని సమూలంగా సంస్కరిస్తూ పౌరుల హక్కులను విస్మరిస్తూ రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను కాలరాస్తూ ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేస్తుందన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్రం, మత సామరాస్యం, ఆర్థిక, సామాజిక, రాజకీయ, హక్కులకు భంగం కలిగిస్తూ బిజెపి అమిత్ షా, మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పౌర హక్కులను మతసామరాస్యాన్ని కాపాడాలంటే దేశంలో వామపక్ష శక్తులు ఐక్యం కావాలని, వామపక్ష ప్రభుత్వం ఏర్పడాలని అప్పుడే దేశ ప్రజలకు సమానంగా జీవించే హక్కు గ్యారంటీ ఉంటుందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం తక్షణ కర్తవ్యం అని అదే కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ కి నిజమైన విప్లవ జోహార్లని అన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ తాటిపల్లి అంజయ్య,, కామ్రేడ్ గొంగళ్ల స్వామీల్, పార్టీ నాయకులు దేవులపల్లి తేజ, గజంగి శ్రీనివాస్, ఆరూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో దుర్గామాత మండపాలు, ఆలయాలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని వివిధ దుర్గామాత మండపాలు, ఆలయాలను నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ చైర్మెన్ పాల్తి రవి, వారి కమిటీ ఆహ్వానం మేరకు కిషన్‌గంజ్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకొని నూతనంగా తీసుకొచ్చిన శ్రీ చక్రానికి అభిషేకం నిర్వహించారు. వినాయక్ నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ 22వ డివిజన్ అధ్యక్షులు మాకు రవి ఆహ్వానం మేరకు వారి కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్నారు. 25వ డివిజన్ అధ్యక్షులు చింతకాయల రాజు ఆహ్వానం మేరకు కోటగల్లిలోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయాన్ని దర్శించుకుని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, జగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

